ప్రజాశక్తి

బుధవారం 9 జులై 2025 5 విజయనగరం




డిఆర్‌డిఎ ఇన్‌ఛార్జి పీడీగా సావిత్రి

ప్రజాశక్తి-విజయనగరం కోట



డిఆర్‌డిఎ, వెలుగు ఇన్‌ఛార్జి ప్రాజెక్టు డైరెక్టర్‌గా కె.సావిత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పీడీగా పని చేసిన కళ్యాణ్ చక్రవర్తి సెర్ఫ్ డైరెక్టర్ గా బదిలీ అవ్వడంతో, ఎపిడి సావిత్రికి పీడీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ప్రతీ ఒక్కరూ తమ సంపూర్ణ సహకారం అందించాలని ఈ సందర్భంగా అధికారులను, సిబ్బందిని కోరారు. సమష్టిగా పనిచేసి పథకాలను, ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.



మోగిన సమ్మె సైరన్

- ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నేడు నిరసనలు ◆ అన్ని విభాగాల్లోనూ సమ్మె నోటీసులు
- ప్రజలంతా సహకరించాలంటూ కార్మిక సంఘాల పిలుపు
- మద్దతు ప్రకటించిన వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉద్యోగ, కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఉమ్మడి విజయనగరం జిల్లాలోనూ సమ్మె జరగనుంది. ఇందుకనుగుణంగా ఉద్యోగులు, కార్మికులు తమ శాఖలు, సంస్థల్లో ఇప్పటికే సమ్మె నోటీసులు అందజేసి సమ్మె సైరన్ మోగించిన సంగతి తెలిసిందే. బుధవారం తెల్లవారి నుంచే సమ్మె చేయనున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు సహకరించాలంటూ సిఐటియు, ఇఫ్టూ, ఎఐటియుసి తదితర ట్రేడ్ యూనియన్లు ఇప్పటికే పిలుపునిచ్చాయి. సమ్మెకు సిపిఎం, సిపిఐ సహా వామపక్ష పార్టీలు మద్దతు ప్రకటించాయి.

కేంద్రంలో మూడో సారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను మరింతగా కాలరాస్తోంది. ఇందులో భాగంగా పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను పక్కనబెట్టి, కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తెచ్చింది. దీనివల్ల ముఖ్యంగా ఉత్పత్తి రంగాల్లో పని చేస్తున్న కార్మికులు, చిరుద్యోగులు తమ హక్కులను, సామాజిక న్యాయాన్ని కోల్పోనున్నారు. కార్మికులకు, పిఎఫ్, ఇఎస్ఐ తదితర సదుపాయాలు కల్పించడం లేదు. ముఖ్యంగా స్కీమ్ వర్కర్ల శ్రమదోపిడి జరుగుతోంది. పనికి తగ్గవేతనాలు ఇవ్వడం లేదు. ఉద్యోగ, పని భద్రత కల్పించడం లేదు. ఈనేపథ్యంలో జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు జిల్లాలోని అంగన్‌వాడీ, ఆయాలు, ఆశా, మధ్యాహ్నం భోజన పథకం కార్మికులు, విఆర్‌ఎలు, పరిశ్రమలు, గనుల్లో పనిచేస్తున్న సంఘటితర, అసంఘటిత రంగ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు, మున్సిపల్, గ్రామ పంచాయతీ, ఆర్టీసి, రైల్వే, పోస్టల్, బ్యాంకులు, ఎల్ఐసి తదితర కేంద్ర ప్రభుత్వ సంస్థల్లోని ఉద్యోగులు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ఉపాధి పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిసెంట్లు, మేట్లు, కూలీలు సమ్మెకు సిద్ధమయ్యారు. బుధవారం విధులు పక్కనబెట్టి ర్యాలీలు, మానవ హారాలు, నల్ల బ్యాడ్జీల తదితర రూపాల్లో నిరసన తెలియజేయనున్నారు. సమ్మె నేపథ్యంలో కార్మిక చట్టాల రద్దును ఉపసంహరించుకోవాలని, ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలనే తదితర డిమాండ్లు ట్రేడ్ యూనియన్లు చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఆశాలు, అంగన్వాడీలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, శానిటేషన్ వర్కర్లు, విఒఎ, ఆర్‌పిలు తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు. అసంఘటితరంగ కార్మికులైన ఆటో, ముఠా, బిల్డింగ్, తోపుడుబండ్లు కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐతో కూడిన సమగ్ర చట్టం చేయాలని కోరుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ పరిశ్రమల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు వెంటనే భర్తీ చేయాలనే డిమాండ్స్‌ను ప్రభుత్వం ముందు ఉంచారు. డ్రైవర్లకు ఉరితాడుగా మారిన మోటారు వెహికల్ చట్టాన్ని రద్దు చేయాలని, ఆప్కోస్‌ను కొనసాగించాలనే డిమాండ్లు ఉన్నాయి. ఇపిఎఫ్ కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని, మూసివేసిన పరిశ్రమలు తెరవాలని, పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి కల్పించాలని ట్రేడ్ యూనియన్లు డిమాండ్ చేస్తున్నాయి. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండలాల్లోనూ సమ్మె సందర్భంగా నిరసన కార్యక్రమాలు జరగనున్నాయి.

కోట నుంచి నిరసన ప్రదర్శన

సమ్మె నేపథ్యంలో కోట నుంచి మూడు లాంతర్లు, గంటస్తంభం మీదుగా కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్టు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ తెలిపారు. ఇందులో అన్ని ప్రజా, ఉద్యోగ, కార్మిక, కర్షక సంఘాలు భాగస్వామ్యమౌతాయని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలను సామాన్య ప్రజలకు తెలియజేసే చారిత్రాత్మక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా సహకరిస్తున్నాయని తెలిపారు.



అర్బన్ హెల్త్ సెంటర్‌లో సమ్మె నోటీసు అందజేస్తున్న ఆశావర్కర్లు

ఆశా వర్కర్ల సమ్మె నోటీసులు

కంటోన్మెంట్ : దేశవ్యాప్తంగా బుధవారం జరిగే సమ్మెలో పాల్గొంటున్నామని విజయనగరం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశారు. లంకా పట్నం, కెఎల్‌పురం, అరుంధతి నగర్, గాజులరేగ, రాజీవ్ నగర్ కాలనీ, జొన్నగుడ్డి, విటి అగ్రహారం, పూల్ బాగ్, సంతపేట, ఇస్మాయిల్ కాలనీ, ధర్మపురి యుపిహెచ్‌సిలో డాక్టర్లకు సమ్మె నోటీస్ అందించారు. సందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, మహాలక్ష్మి మాట్లాడుతూ సమ్మెలో ఆశా వర్కర్లంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమ్మె నోటీస్ ఇచ్చిన వారిలో కనకమహాలక్ష్మి, రాజేశ్వరి, వాసవి, అప్పయ్యమ్మ, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి పట్టణంలో పర్యటిస్తున్న హోంశాఖా మంత్రి అనిత, ఎమ్మెల్యే బేబినాయన తదితరులు

ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు

హోంశాఖా మంత్రి అనిత

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి ప్రజల విశ్వాసం పొందుతామని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. పట్టణంలోని 17వ వార్డులో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమెకు కోటలో ఎమ్మెల్యే బేబినాయన, డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున, నాయకులు, శ్వేతా చలపతి పాఠశాల వద్ద కౌన్సిలర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం వార్డులో పర్యటించి ఎన్నికల హామీలను వివరించారు. బొబ్బిలిలో తనకు ఆడపిల్లకు ఇచ్చిన గౌరవం ఇచ్చారని మంత్రి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్, టిడిపి పట్టణ అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్ సమావేశానికి హాజరు కావాలి

ఈనెల 10న జరగనున్న మెగా పేరెంట్స్ సమావేశానికి హాజరు కావాలని మంత్రి అనితకు కెజిబివి ప్రిన్సిపాల్ స్వప్న, విద్యార్థులు ఆహ్వానం అందించారు. విద్యార్థులు చేసిన ప్రాజెక్టులను మంత్రికి వివరించగా అభినందించారు.

మహిళల గౌరవాన్ని కాపాడండి : మంత్రి

మహిళల గౌరవాన్ని కాపాడాలని వైసిపి నాయకులను రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత కోరారు. కోటలో విలేకర్లతో మాట్లాడారు. టిడిపి మహిళా ఎమ్మెల్యేపై వైసిపి మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి అసభ్యకరంగా మాట్లాడడం సభ్యసమాజం తలదించుకుంటుందని చెప్పారు. మహిళలను కించపరచడం వైసిపి డిఎన్ఎలోనే ఉందని విమర్శించారు. జర్నలిస్టు ముసుగులో కృష్ణంరాజు రాజధాని మహిళలను వేశ్యలతో పోల్చి కించపరిచారన్నారు. మహిళలను కించపరుస్తున్నా వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డిలో చలనం రావడం లేదన్నారు. మహిళ ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రసన్న కుమార్ ను వైసిపి నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గంజాయి నివారణకు ఈగల్ టీమ్ ఏర్పాటు చేశామన్నారు.ఆడపిల్లల రక్షణకు ఈగల్ టీమ్ పని చేస్తుందన్నారు. పాఠశాలల్లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై పిల్లలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్యే బేబినాయన, టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున ఉన్నారు.



నిరసనను ఉద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం నాయకులు చల్లా జగన్

భూములిచ్చే వరకూ పోరాడుతాం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిందాల్ భూములను నిర్వాసిత రైతులకు ఇచ్చేవరకు పోరాడుతూనే ఉంటామని సిపిఎం నాయకుడు చల్లా జగన్ హెచ్చరించారు. జిందాల్ భూనిర్వాసితులు గత 20 రోజులుగా పోరాటం చేస్తుంటే ఆదుకోవ్వాన జిల్లా కలెక్టర్ , రక్షణ కల్పించవలసిన పోలీసులు తీరు విచారకరమని అన్నారు. బొడ్డవరలో నిర్వాసితులు చేస్తున్న నిరసన కార్యక్రమంలో జగన్ మాట్లాడారు. ధర్నాలకు అనుమతులు తీసుకోవాలని జిల్లా పోలీస్ అధికారులు చెబుతున్నారని,తాము అనుమతులు కోరుతున్నా కలెక్టర్ నుంచి మండల అధికారుల వరకు ఇవ్వడం లేదని అన్నారు. 18 సంవత్సరాల క్రితం తీసుకున్న భూముల్లో పరిశ్రమ పెట్టనందున తిరిగి వారి భూమి వారికి ఇవ్వాలని చట్టం చెబుతున్నా పట్టించుకోకుండా జిందాల్‌కు కొమ్ము కాయడం సరికాదన్నారు. అధికారులు స్పందించి జందాలు బాధితులకు న్యాయం చేయాలని, అప్పటివరకు ఆందోళన నిర్వహించేందుకు అనుమతులు ఇవ్వాలని కోరారు అప్పుడు జందాల్ భూములవ్వండి అని చెప్పిన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ నిర్వాసితుల సమస్యపై తక్షణమే స్పందించాలన్నారు స్థానిక ప్రజాప్రతినిధులు అందరూ నిర్వాసితుల తరపున నిలబడాలని , మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ రఘురాజు మద్దతు పలికారు.

నాణ్యతలేని ఆహారాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు

12 మంది వ్యాపారులకు రూ.3లక్షలు జరిమానా

జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

నాణ్యతలేని, కల్తీ ఆహార పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలను తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ హెచ్చరించారు. జిల్లాలో నాణ్యత లోపించిన ఆహారాన్ని విక్రయించిన 12 మందికి రూ.3లక్షలు అపరాధ రుసుం విధించారు. రాజాంలో నలుగురు, బొబ్బిలిలో ఇద్దరు, గజపతినగరంలో ముగ్గురు, దత్తిరాజేరులో ఒకరు, కొత్తవలసలో ఇద్దరిపై కేసులు నమోదు చేసి, జెసి ఎదుట ఉంచారు. వీరికి మొత్తం రూ.3లక్షలు విలువైన అపరాధ రుసుము విధిస్తూ జెసి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి, కల్తీ ఆహార పదార్థాలు, నాణ్యత లేనివి, అదేవిధంగా అపరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాలను విక్రయించేవారిపై కేసులు నమోదు చేయాలని, జిల్లా ఆహార భద్రతాధికారి పి.వెంకటరమణ, జిల్లా ఆహార నియంత్రణాధికారిణి ఎస్.ఈశ్వరిని ఆదేశించారు.

మినిమం టైం స్కేల్ అమలు చేయాలి

ప్రజాశక్తి-మెంటాడ రూరల్

సమ్మె ఒప్పందాల మేరకు ఉద్యోగుల కీలకమైన అంశాలు హెచ్ఆర్ పాలసీ అమలుకు కమిటీ, మినిమం ఆఫ్ టైం స్కేల్, వేతనాలు పెంపు, ఇపిఎఫ్ అమలు, ప్రభుత్వ ఉద్యోగాలలో వెయిటేజీ, కారుణ్య నియామకాలు తదితర సమస్యల పరిష్కారం కోసం మంగళవారం మండల కేంద్రాల్లో కెజిబివి స్కూల్స్ వద్ద, మండల కేంద్రాల్లోనూ మధ్యాహ్న విరామ సమయంలో సామూహిక నిరసన తెలిపారు. మెంటాడలో రాష్ట్ర చైర్మన్ బి.కాంతారావు, జిల్లా కెజిబివి ఉద్యోగుల నాయకురాలు శారద, మండల అధ్యక్షులు చంద్రరావు బాలరాజు, మహిళా కార్యదర్శులు శివగంగా, శైలజ, సిఆర్ఎంటి గౌరు నాయుడు, తదితరులు పాల్గొన్నారు. బుధవారం కూడా నిరసనలు కొనసాగుతాయని తెలిపారు.



నిరసన తెలుపుతున్న కెజిబివి ఉద్యోగులు, ఉపాధ్యాయులు

పాన్‌షాపుల్లో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ పేరుతో విద్యాసంస్థల సమీపంలోని పాన్ షాపులు, కిరాణ షాపుల్లో మంగళవారం ఎస్‌పి వకుల్‌జిందాల్ ఆధ్వర్యాన పోలీసులు తనిఖీలు చేపట్టారు. స్థానిక పోలీసులు, ఈగల్, ఎస్బీ పోలీసులు సంయుక్తంగా విద్యాసంస్థలకు దగ్గరలోగల పాన్ షాపులు, కిరణా షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టగా, జిల్లా ఎస్‌పి స్వయంగా తనిఖీల్లో పాల్గొన్నారు. బాలాజీనగర్ లోని శ్రీనివాస, ఆదిత్య, చైతన్య డిగ్రీ కళాశాల సమీపంలోని పాన్ షాపుల్లో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. 15 షాపుల్లో తనిఖీలు చేపట్టి సిగరెట్లును స్వాధీనం చేసుకొని, వారిపై కోట్పా చట్టం కింద కేసులు నమోదు చేసి, జరిమానాలు విధించారు.

విద్యాసంస్థలకు సమీపంలోని పాన్ షాపులు, కిరాణా షాపుల్లో సిగరెట్స్, నిషేధిత ఖైనీ గుట్కాలు, మత్తు కలిగించే చాక్లెట్స్ వంటి వస్తువులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో విజయనగరం డిఎస్‌పి ఎం. శ్రీనివాసరావు, వన్ టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్, ఎస్‌బి సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్‌విఆర్‌కె చౌదరి, ఎస్ఐలు ప్రసన్నకుమార్, రామగణేష్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు, ఈగల్ టీమ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లిమర్ల : ఎస్‌పి ఆదేశాల మేరకు నెల్లిమర్ల ఎస్ఐ బి. గణేష్, సిబ్బంది పాన్ షాప్‌లను తనిఖీ చేశారు. కొంతమంది వ్యక్తులు కాలేజీకి దగ్గర్లో విద్యార్థులకు సిగరెట్లు అమ్ముతుండడం గమనించి వారిపై జరిమానా విధించారు. పాన్ షాప్‌లో ఎవరైనా గంజాయి చాక్లెట్లు, గంజాయికి సంబంధించిన సిగరెట్లు, ఇతర ఏ రూపంలో అయినా మత్తు పదార్థాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ గణేష్ తెలిపారు.



పాన్‌షాప్‌లో తనిఖీలు చేస్తున్న ఎస్‌పి వకుల్ జిందల్, సిఐ శ్రీనివాస్

15 పాన్ షాపులపై కేసు నమోదు

సంతకవిటి : మండలంలోని సేఫ్ క్యాంపస్ జోన్ కార్యక్రమాన్ని రాజాం రూరల్ సిఐ హెచ్. ఉపేంద్రరావు ఆధ్వర్యాన నిర్వహించారు. విద్యాసంస్థలకు సమీపంలో ఉన్న పాన్ షాపులను ఆకస్మిక తనిఖీలు చేశారు. పాఠశాల, కళాశాలకు దగ్గరలోని ఉన్న పాన్ షాపులలో సిగరెట్లు ఇతర పొగాకు ఉత్పత్తులు అమ్మే 15షాపులపై కేసులు నమోదు చేసి, రూ. 3వేలు జరిమానా వేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు వారికి పొగాకు ఉత్పత్తులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఆర్.గోపాలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి హయాంలో విధ్వంసం

బొత్స, చిన్నశ్రీను వ్యాఖ్యలు అర్థరహితం
టిడిపి జిల్లా అధ్యక్షులు నాగార్జున

ప్రజాశక్తి -విజయనగరంకోట

వైసిపి హయాంలో విధ్వంసం, దోపిడీ జరిగాయని టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. టిడిపి పాలనలో సుపరిపాలన అందిస్తున్నామని అన్నారు. టిడిపి కార్యాలయం అశోక్‌బంగ్లాలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు ముగిసిన 13 నెలల తర్వాత వైసిపి నాయకులు కార్యకర్తల వద్దకు ఇప్పుడిప్పుడే వెళ్తున్నారని విమర్శించారు. వారి పరిపాలన బాగోలేదు కాబట్టే 11 సీట్లు ఇచ్చి ప్రజలు ఇంట్లో కూర్చోబెట్టారని తెలిపారు. అది గ్రహించకుండా ప్రభుత్వం మీద బురద జల్లే ప్రయత్నాలు చేయడం సరైంది కాదన్నారు. సమావేశాల పేరిట కూటమి ప్రభుత్వంపై ఇష్టానుసారం మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. ఇటీవల ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రాష్ట్రాన్ని గత ఐదేళ్లలో వైసిపి నేతలు అతలాకుతలం చేసినా.. చంద్రబాబు తన మేధస్సుతో, పనితనాన్ని ఉపయోగించి సంక్షేమం, అభివృద్ధి చేస్తున్నారని గుర్తు చేశారు. అన్నక్యాంటీన్లు తెరిచామని, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశామని చెప్పారు. మత్స్యకారులకు గత ప్రభుత్వం రూ.10 వేలు ఇస్తే.. తాము రూ.20 వేలు ఇస్తున్నామని తెలిపారు. గతంలో కుటుంబంలో ఎంతమంది ఉన్నా తల్లికి వందనం వర్తింజేశామని తెలిపారు.

జిల్లా పరిషత్తు చైర్మన్ చిన్నశ్రీనుకు అసలు రాజకీయ అవగాహన లేనట్లుందని నాగార్జున విమర్శించారు. పి4 విషయంలో ఆయన మాటలు చూస్తే ఇదే అర్థమవుతుందన్నారు. ప్రజలను, కార్యకర్తలను మభ్యపెట్టడానికి తప్పుడు సందేశాలు ఇవ్వొద్దని సూచించారు. 'అవినీతి సొమ్ము కోసం వైసిపి నాయకులు మాట్లాడటం విడ్డూరంగా ఉందని, జిల్లాలో రూ.వేల కోట్ల అక్రమార్జన ఎవరి వద్ద ఉందో ప్రజలందరికీ తెలుసునని అన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆల్తి బంగారుబాబు, మాజీ మున్సిపల్ వైఎస్ చైర్మన్ కనకల మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు

వైసిపి మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలకు ఎమ్మెల్యే ఖండన

మహిళలను గౌరవించడం సామాజిక బాధ్యత అని, కానీ వైసిపి నాయకులు మహిళల పట్ల అగౌరవంగా, మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచే విధంగా మాట్లాడటం చాలా బాధాకరమని ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి అన్నారు. మహిళా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై వైసిపి మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆమె ఖండించారు. ఆయనపై వైసిపి చర్యలు తీసుకోవాలన్నారు.


వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా మందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సచివాలయ కార్యదర్శులకు, ఎఎన్ఎం లకు కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డెంగ్యూ, మలేరియా వ్యాధుల వ్యాప్తికి దోమలే ముఖ్య కారణమన్న విషయాన్ని గుర్తించాలన్నారు. దోమలు వృద్ధి కేంద్రాలను గుర్తించి నశింపజేయాలని చెప్పారు. ప్రతిరోజు ఫీవర్ సర్వేలను చేపట్టాలన్నారు. మంగళవారం, శుక్రవారం రోజుల్లో డ్రైడే పాటించాలని సూచించారు. సమావేశంలో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి పాల్గొన్నారు.

వీధి విక్రయదారుల సర్వే పూర్తి చేయాలి

నగరంలో వీధి విక్రయదారుల పూర్తి వివరాల సర్వేను బుధవారం నాటికి పూర్తి చేయాలని కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రిసోర్స్ పర్సన్స్, వెల్ఫేర్ కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాలు మేరకు పిఎం స్వానిధి, వీధివిక్రయదారుల వివరాలను గడువుగా పూర్తిచేసి నివేదించాలని చెప్పారు. ఆయా సర్వే ద్వారా అర్హులుగా గుర్తించిన వారికి గుర్తింపు కార్డులు, వీధి విక్రయాల ధ్రువ పత్రాలను అందజేయనున్నట్లు చెప్పారు. ఇందుకోసం 150 రూపాయలు వసూలు చేయాలన్నారు. టిపిఆర్ఓ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ పి.నల్లనయ్య

అనధికార నిర్మాణాలు తొలగింపు

స్థానిక కాళీఘాట్ కాలనీలో అనధికార నిర్మాణాన్ని ప్రణాళిక సిబ్బంది తొలగించారు. కాళీఘాట్ కాలనీలో ఓ వ్యక్తి అనుమతులు లేకుండా అధనపు భవన నిర్మాణాన్ని చేపడుతున్నట్లు సమచారం రావడంతో చర్యలు చేపట్టారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, ఐసిడిఎస్ పీడీ

బాధిత మహిళలకు అండగా సఖి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

బాధిత మహిళలకు సఖి వన్ స్టాప్ సెంటర్ ద్వారా అవసరమైన అన్ని రకాల సేవలను అందిస్తున్నామని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అన్నారు. దాడికి గురైన మహిళలు, బాలికలకు న్యాయ, వైద్య, పోలీసు సహాయంతో బాటు, కౌన్సిలింగ్ నిర్వహించడమే కాకుండా, వారి రక్షణ కోసం తాత్కాలిక వసతిని కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. దీనికి సంబంధించి పోస్టర్ ను తమ ఛాంబర్ లో కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ విమలారాణి, నోడల్ అధికారి నాయుడు, వన్ స్టాప్‌సెంటర్ అడ్మినిస్ట్రేటర్ విజయ లక్ష్మి, కౌన్సెలర్ రమాదేవి, డిసిపిఒ లక్ష్మి, డివి సెల్ లీగల్ కౌన్సెలర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

14న ఐటిఐలో అప్రెంటీస్ షిప్ మేళా

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఈనెల 14న ఉదయం 9గంటల నుంచి ప్రధాని మంత్రి నేషనల్ అప్రెంటీస్ షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ టివి గిరి తెలిపారు. ఐటిఐ పాసైన వారు ఈ అప్రెంటీస్‌షిప్ మేళాలో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఈస్ట్‌కోస్ట్ రైల్వేతో పాటు ప్రైవేట్ రంగానికిచెందిన జయభేరి ఆటోమొబైల్ ప్రైవేట్ లిమిటెడ్, వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్, భగవతి ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, క్యూసివ్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్, సాంసంగ్ ఆథరైజ్ సర్వీస్ సెంటర్, నవదీప్ ఎలక్ట్రానిక్స్, వోల్టాస్ ఆథరైజ్డ్ సర్వీస్ సెంటర్, ఐఎఫ్‌బి ఆథరైజర్ సర్వీస్ సెంటర్, విజయనగర్ బయోటెక్ దితర ప్రముఖ కంపెనీలకు ఆహ్వానించినట్లు తెలిపారు. ఎంపికైన వారికి ఆయా పరిశ్రమల్లో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తగిన స్టయిఫండ్ చెల్లించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికేట్స్, ఆధార్ కార్డు, 2 ఫోటోస్‌తో పాటు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు ఫోన్ నంబర్లు 9441518355, 9849944654 ను సంప్రదించాలని తెలిపారు.

11న క్రీడా పాఠశాలకు ఎంపికలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కడప జిల్లాలోగల క్రీడాపాఠశాలలో 4,5తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న వారిలో ఈనెల 11న ఎంపిక స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో ఎంపిక జరుగుతుందని డిఎస్‌డిఒ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న 16 మంది మాత్రమే హాజరు కావాలని తెలిపారు. జిల్లా స్థాయిలోఎంపికైన వారు ఈనెల 21 నుంచి 23 వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి ఎంపికపోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాలకు విజయ నగరం జిల్లాకు చెందిన వారు 9491767327, 7799620244, మన్యం పార్వతీపురం జిల్లాకు చెందిన వారు 8712622564 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

సెప్టెంబర్ 28న మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు

విజయనగరం టౌన్ : సెప్టెంబరు 28న విజయనగరంలో జరిగే ఓపెన్ మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలను జయప్రదం చేయాలని బాడీబిల్డర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రెడ్డి శంకరరావు, నిర్వాహకులు కనకలకృష్ణ కోరారు. మంగళవారం ఈ పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభినవ భీమ కోడిరామమూర్తి , నాగమళ్ళ పైడిరాజు స్ఫూర్తితో యువకులు ఈ పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో కోరాడ శ్రీనివాసరావు, కోట్ల రమేష్ ,బైక్ రమేష్, శ్రీనివాస్ వర్మ, ప్రోటీన్ ఫ్యాక్టరీ వంశీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు సెల్‌ఫోన్ రిపేర్ లో శిక్షణ

విజయనగరం టౌన్ : తెలగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో యువతకు సెల్ ఫోన్ రిపేర్ లో శిక్షణ ఇస్తున్నట్లు తెలగ సంఘం జిల్లా అధ్యక్షులు పెద్ది లక్ష్మీ నారాయణ తెలిపారు. 10 రోజులు పాటు ఈ శిక్షణా కార్యక్రమం ఉంటుందని, అనంతరం మరో బ్యాచ్‌కు శిక్షణ ఇస్తామని తెలిపారు. బ్యూటీ పార్లర్ లో కూడా శిక్షణ అందిస్తామన్నారు. ఆసక్తి గల వారు 9440434529, 9440154879,984834888 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

అన్నీ తానై వృద్ధురాలికి అంత్యక్రియలు

మానవత్వం చాటుకున్న సామాజిక కార్యకర్త

ప్రజాశక్తి- రేగిడి


దహన సంస్కారాలు చేస్తున్న సిద్ధార్థ

మండలంలోని వావిలివలస గ్రామంలో రాహుల్ సౌరబ్ నిత్య అన్నదాన సత్రంలో తల దాచుకున్న నిరుపేద వృద్ధురాలు వనజమ్మ (75) మృతి చెందడంతో అదే గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త పాలూరు సిద్ధార్థ అన్నీ తానై మంగళవారం అంత్యక్రియలు చేశారు. రాహుల్ సౌరబ్ నిత్య అన్నదాన సత్రంలో వృద్ధురాలు 2,500 రోజులుగా ఉంటూ అన్న, పానీయాలు తింటూ జీవనం గడిపేది. సోమవారం రాత్రి నిద్రలోనే వనజమ్మ మృతి చెందారు. దీంతో అనాథగా ఉన్న ఆమె మృత దేహాన్ని గ్రామస్తులు, యువత సహకారంతో సిద్ధార్థ శ్మశానానికి తీసుకెళ్లి అంత్యక్రియలు జరిపించాడు. లింగాలవలసకు చెందిన వనజమ్మకు ఎవరూ లేకపోవడంతో గత ఆరేళ్లుగా సత్రంలోనే ఉంటుంది. అన్ని తానై వృద్ధురాలి అంత్యక్రియలు చేయడంతో పలువురు సిద్ధార్థను అభినందించారు.

18న యూనిట్ స్థాయి ఎన్నికలు

ప్రజాశక్తి - గంట్యాడ

ఈ నెల 18వ తేదీన ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ యూనిట్ స్థాయి ఎన్నికలు జరుగుతాయని ఎంపిడిఒ ఆర్‌వి రమణమూర్తి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యూనిట్ పరిధిలో గంట్యాడ విజయనగరం మండలాలకు చెందిన పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగులకు ఎన్నికలు జరుగుతాయన్నారు. సాయంత్రం నాలుగు గంటల నుండి నామినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, రెండు మండలాలకు సంబంధించిన మినిస్టీరియల్ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఓట్లు లెక్కింపు అనంతరం అదే రోజు ఫలితాలు ప్రకటిస్తామన్నారు. ఈ విషయం పైన మంగళవారం మండల కార్యాలయంలో నోటిఫికేషన్ అధికారికంగా విడుదల చేశామని ఆయన తెలిపారు

కండ్ల కలకపై నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి - తెర్లాం

కండ్ల కలకపై నిర్లక్ష్యం చేయవద్దని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి పెద్దింటి వంశీకృష్ణ అన్నారు. స్థానిక పిహెచ్ ఆవరణంలో మంగళవారం కండ్ల కలకలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల కారణంగా కండ్లకలకలు వచ్చే ప్రమాదం ఉందని జాగ్రత్తలు పాటించాలని కోరారు. పేరుమాలి ఆప్తాల్మిక్ అధికారి ఎస్.వసంతరావు మాట్లాడుతూ కన్ను ఎరుపు, దురద, మంట, నీరుకారడం, పుసికట్టడం, వెలుతురు చూడలేకపోవడం వంటివి కండ్ల కలకకు ప్రధాన లక్షణాలు అన్నారు. అనంతరం గత 6 నెలల్లో కంటి శుక్లాలు ఆపరేషన్లు కోసం మోటివేట్ చేసిన విజయరామపురం, రంగప్పవలస ఆశా వర్కర్లు రామలక్ష్మి, సత్యవతిలను ప్రభావతి జాగృతి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు రొటేరియన్ ఎస్.వసంతరావు వైద్యాధికారులు డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ రెడ్డి స్వాతి చేతుల మీదుగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి బి.భాస్కరరావు, జి.రాధమ్మ, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఐటి 2.0తో మెరుగైన సేవలు

ప్రజాశక్తి - గజపతినగరం

పోస్ట్ ఆఫీస్ నూతన సాఫ్ట్ వేర్ ఐటి 2.0తో మెరుగైన సేవలు అందుతాయని సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర అన్నారు. మంగళవారం స్థానిక సబ్ పోస్ట్ ఆఫీస్‌లో ఆయన ఐటి 2.0 సాంకేతికతను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీ 2.0తో వినియోగదారులకు సులభంగా, పారదర్శకంగా సేవలు అందుతాయని తెలిపారు. అనంతరం కంప్యూటర్‌లో జరుగుతున్న తీరును నిశితంగా పరిశీలించారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - డెంకాడ


చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే

మండలంలోని పినతాడివాడకు చెందిన పులి పైడి నాయుడు కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి ప్రభుత్వంతో మాట్లాడి ఆయనకు సిఎం సహయ నిధి నుంచి రూ. 5లక్షల చెక్కును మంగళవారం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, టిడిపి మండల అధ్యక్షులు పల్లె భాస్కరరావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల, సతివాడ సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 10న విద్యుత్ అంతరాయం కలుగుతుందని టౌన్ డిఇఇ పి.త్రినాధరావు ఒక ప్రకటనలో తెలిపారు. 11కెవి పరిధిలో చెట్టుకొమ్మలు తొలగింపు, సాంకేతిక సమస్యల పరిష్కారంలో భాగంగా నెల్లిమర్ల సబ్ స్టేషన్ 33/11 కెవి గుర్ల రూరల్ ఫీడర్‌లో గరికిపేట, కొండగుంపాం, పూతికపేట, మొయిద నారాయణ పట్నం, చింతల పేట, మజ్జిపేట గ్రామాలకు, సతివాడ సబ్ స్టేషన్ పరిధి రామతీర్థం, ఒమ్మి రూరల్ ఫీడర్ పరిధిలో ఒమ్మి, మాల్యాడ, బొప్పడాం, బొడ్డపేట, వెంకన్నపాలెం గ్రామాలకు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుతుగుతోందన్నారు.

కొండచాకరాపల్లిలో ఏనుగుల సంచారం

ప్రజాశక్తి - వంగర


వరిని ధ్వంసం చేస్తున్న ఏనుగులు

గత నెలలో మండలంలోకి ప్రవేశించిన గజరాజులు పలు గ్రామాలలో సంచరించి వివిధ పంటలను ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. నాలుగు రోజులు క్రితం వంగర మండల కేంద్రం నుండి ఎం.సీతారాంపురం, తలగాం, కొత్తవలస, కొప్పర గ్రామాల పొలాలు మీదుగా కొండచాకరాపల్లి చేరుకుని అక్కడ తిష్ట వేసాయి. పొలాల్లో సంచరించి వరి, కొబ్బరి, అరటి పంటలను ధ్వంసం చేస్తున్నాయని అక్కడ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సమీపంలోనే సంచరిస్తూ ఉండడంతో దాడి చేస్తాయేమోనని జనం బెంబేలెత్తిపోతున్నటువంటి పరిస్థితి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గజరాజులను అటవీ ప్రాంతానికి తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

ప్రజాశక్తి - వంగర

మండలంలోని కొట్టిశలో అక్రమంగా మద్యం అమ్ముతున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సిఐ ఆర్ జై భీమ్ తెలిపారు. గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించి అమరాన వెంకటరావు, కల్లూరి గవరయ్య, సూరి పోలిరాజులను మంగళవారం అదుపులోకి తీసుకుని 29 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జి.మాన్యాలు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతిబసు జయంతి

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలో బిరసాడవలస గ్రామంలో మంగళవారం పశ్చిమ బెంగాల్ దివంగత ముఖ్యమంత్రి జ్యోతి బసు 111వ జయింతి వేడుకలు అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులుం రాకోటి రాములు మాట్లాడుతూ 25 ఏళ్లపాటు పరిపాలనలో నిరుపేదలకు భూములు పంచి, కార్మికులకు అండగా, రైతులకు గిట్టుబాటు ధర కల్పించి రాష్ట్రంలో సుపరిపాలన అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆయన ఆశయాలకు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అప్పలనరసయ్య, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-బొబ్బిలి


బొబ్బిలి: కార్మికులతో మాట్లాడుతున్న శంకరరావు

పాలకుల్లారా! మమ్మల్ని బానిసలుగా చేసే లేబర్ చట్టాలు మీరు అమలు చేస్తే! మిమ్మల్ని బంగాళాఖాతంలో కలిపేస్తామని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు హెచ్చరించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మిక వర్గాన్ని బానిసత్వంగా మార్చే 4 లేబర్ కోడ్స్ తక్షణమే రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కార్మికులతో సమావేశం నిర్వహిం చారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకరరావు మాట్లాడుతూ ఈ నెల 9న జరగనున్న సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జి గౌరీ, కార్యదర్శి రామారావు, యుగంధర్, వాసు, శంకర్రావు కార్మికులు పాల్గొన్నారు.

తెర్లాం : మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లోని అధికారులకు సిపిఎం మండల నాయకులు సింగిరెడ్డి గోపాలు ఆధ్వర్యంలో సమ్మెనోటీసులను అందించారు. సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకరరావు, శారద, మరియమ్మ, చిన్నమ్ములు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మిక వర్గం విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు, ఐఎఫ్‌టియు నాయకులు ఎన్.తిరుపతి రావు కోరారు. వ స్థానిక జ్యూట్ మిల్ గేటు వద్ద ఈనెల 9న జరిగే దేశావ్యాపిత సార్వత్రిక సమ్మె పాల్గొని జయప్రదం చేయాలని కార్మికులకు గేటు మీటింగ్ నిర్వహించారు. సమ్మె రోజున రామతీర్థం జంక్షన్ నుంచి మొయిద జంక్షన్ వరకు ర్యాలీ, మానవహారం చేస్తున్నామని కార్మిక వర్గం పాల్గొనాలని కోరారు. ఈ సమ్మెకు శ్రామిక సంఘం నాయకులు చిక్కాల గోవింద, బేతా అప్పారావు మద్దతు పలికారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నాయకులు ఎం.అప్పలనాయుడు, కె. అప్పలసూరి పాల్గొన్నారు.

ఇయు సంఘీభావం

విజయనగరం కోట : హక్కుల సాధనకోసం, సంక్షేమ చట్టాల రక్షణకు బుధవారం జరిగే సార్వత్రిక సమ్మెకు ఎపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్ (ఇయు), అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు సంఘీభావం తెలుపుతున్నట్లు జోనల్ ఇన్చార్జి పి.భానుమూర్తి తెలిపారు. వర్కుషాపులో పనిచేసే ఉద్యోగులంతా ఎర్రబ్యాడ్జీలు ధరించి సంఘీబావం తెలియజేయాలని తెలిపారు.

సమ్మెకు కార్మిక సంఘాల మద్దతు

విజయనగరం టౌన్ : నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ విధానాలు నిలుపుదల చేయాలని తదితర డిమాండ్లతో కార్మిక సంఘాలు చేపట్టిన సమ్మెకు జయప్రదం చేయాలని అల్యూమినియం స్పిన్నింగ్ అండ్ రోలింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బెహరా శంకర్రావు, షాప్ అండ్ ఎస్టాబ్లిస్‌మెంట్ వర్కర్స్ యూనియన్ నాయకులు మద్ది అప్పలరాజు, అసంఘటిత కార్మిక హక్కుల సాధన సమితి కన్వీనర్ బెహరా గిరి ప్రసాద్ కోరారు.

అసిస్టెంట్ కమిషనర్‌కు సమ్మె నోటీస్

మున్సిపల్ ఇంజనీరింగ్ అండ్ నాన్ సిహెచ్ కార్మికులకు బేసిక్ వేతనం 21వేలు, టెక్నికల్ వేతనం రూ.24,500 చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9న సమ్మెలో పాల్గొంటున్నామని ఇంజినీరింగ్ కార్మికులు మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావుకు నోటీసు అందజేశారు. యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎ.జగన్ మోహన్ రావు, బి. భాస్కరరావు, ఉపాధ్యక్షులు ఎస్.రాజు, చిన్నారావు, కోశాధికారి సభ్యులు రాఘవ, పాల్గొన్నారు.

జులై 9న టైర్ బంద్ చేద్దాం

పూసపాటిరేగ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రవాణా రంగానికి వ్యతిరేకమైన విధానాలను వ్యతిరేకిస్తూ, 9న జరుగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలో జరిగిన పోస్టర్ ఆవిష్కరణలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి. సూర్యనారాయణ మాట్లాడారు. సమ్మెకు మద్దతుగా 9న టైర్ బంద్ చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, ఆటో యూనియన్ నాయకులు కొర్లయ్య, వాల్లె సూర్యనారాయణ, కె.రామనాయుడు, రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ఆర్ జయంతి

ప్రజాశక్తి-చీపురుపల్లి

మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజ శేఖర్ రెడ్డి జయంతి వేడుకలను వైసిపి ఆధ్వర్యాన మంగళవారం ఘనంగా నిర్వహించారు. కూటమి పాలన మోసపూరితమైనదనే విషయాన్ని ప్రజలు గ్రహించారని వైసిపి జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. వైయస్ రాజశేఖర్‌రెడ్డి జన్మదిన సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న వైయస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచారం విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, చీపురుపల్లి నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, కెవివి సూర్యనారాయణరాజు, చీపురుపల్లి సర్పంచ్ మంగళగిరి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజ శేఖర్ రెడ్డి జయంతి వేడుకలను మంగళశారం కొత్తవలస జంక్షన్‌లో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్ళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, జెసిఎస్ మండల ఇంచార్జ్ బొంతల వెంకటరావు, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, పల్ల భీష్మ, సర్పంచ్ మదీన అప్పలరాము, బూసాల దేముడు, గేదెల త్రినాథ మూర్తి, ఉత్తరపల్లి గణేష్, తుమ్మికపల్లి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా చేపల ఖానా వద్ద ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భారీ కేకును కట్ చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ చైర్మన్ రొంగలి కనక సింహాచలం, వైసిపి మండల అధ్యక్షుడు పిన్నింటి తమ్ము నాయుడు, సర్పంచ్ పతివాడ గౌరీ, వైసిపి అంగన్వాడి జిల్లా అధ్యక్షులు పతివాడ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.


చీపురుపల్లి : మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్

వేపాడ: రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి ఎంపిపి దొగ్గ సత్యవంతుడు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పారావు, మండల అధ్యక్షులు జగ్గు బాబు, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, మండల సీనియర్ నాయకులు దుల్ల మహేష్, మండల సర్పం చుల సంఘం అధ్యక్షులు వెంకట్రావు, సోంపురం సర్పంచ్ గంగ రాజు, చినగుడి పాల సర్పంచ్ రామనాయుడు, చామలపల్లి సర్పంచ్ సతీష్, వేపాడ సర్పంచ్ మేలిపాక రమణ, మండల జెసిఎస్ కన్వీనర్ శ్రీను, మండల యువత అధ్యక్షుడు శ్రీను, వావిలపాడు నాయకులు శ్రీరామమూర్తి, భర్తవానిపాలెం నాయకులు రమణ, నిరుజోగి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: స్థానిక మొయిద జంక్షన్ వద్దగల వైఎస్ఆర్ విగ్రహానికి ఎమ్మెల్సీ సురేష్‌బాబు మంగళవారం పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ల సుధారాణి, జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, మండల వైస్ ఎంపిపిలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, రేగాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంకోట: వైఎస్ఆర్ జయంతి సందర్భంగా మంగళవారం ఇడుపల పాయలో వైఎస్ఆర్ ఘాట్ వద్ద జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరిపి విద్యాసాగర్ నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బొబ్బిలి : పట్టణంలో అమ్మిగారి కోనేరు గట్టు వద్ద ఉన్న వైఎస్ ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, గొల్లపల్లిలో వైఎస్ఆర్ విగ్రహానికి మున్సిపల్ మాజీ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. వైసిపి పట్టణ అధ్యక్షులు చోడిగంజి రమేష్ నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొండపల్లి : బొండపల్లిలోని బజారు సముదాయం వద్దగల వైఎస్ విగ్రహానికి వైసిపి నాయకులు పాలాభిషేకం చేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపిపి చల్లా చెలం నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల చిన్నం నాయుడు వైస్ ఎంపిపి గొండెల ఈశ్వర రావు, మాజీ ఎంపిపి బండారు బంగారం, బోడసింగి జగదీశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు మహంతి రమణ, సర్పంచులు బొండపల్లి ఈశ్వరరావు, కర్రోతు శ్రీనివాసరావు, మునకాల పైడి నాయుడు,సిరిపురపు ఆదినారాయణ పాల్గొన్నారు.

లక్కవరపుకోట : చందులూరులో వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి ఎంపిపి గేదెల శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చందులూరు, పోతంపేట, రేగ ఎంపిటిసి సభ్యులు ఎడ్ల కిషోర్, భూమిరెడ్డి స్వామి నాయుడు, బొడ్డు గణపతి, నాయకులు కె మహేష్, ఆవాల సత్యనారాయణ, మల్లి వీడు సర్పంచ్ ఆదిరెడ్డి అర్జున, తూర్పాటి అప్పలరాజు, పిల్లల జ్యోతి, కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు దూరంగా పాన్‌షాపులు : డిఎస్‌పి

ప్రజాశక్తి - చీపురుపల్లి

పాఠశాలలకు కనీసం 100 మీటర్ల దూరంలో పాన్‌షాపులు ఉండాలే తప్ప అతి దగ్గరలో ఉండకూడదని చీపురుపల్లి డిఎస్‌పి ఎస్.రాఘవులు వ్యాపారస్తులకు సూచించారు. చీపురుపల్లిలో పాఠశాలలకు సమీపంలో ఉన్న పాన్‌షాపులను ఆయన ఎస్ఐ ఎల్ దామోదరరావుతో కలసి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాన్‌షాపులు, కిల్లీ దుకాణాలలో మత్తు పదార్థాలు, పొగాకుకు సంబంధించిన సిగరెట్లు, బీడీలు, గంజాయి వంటి మత్తు పదార్థాలను విక్రయించకూడదని సూచించారు. ఈ సందర్భంగా బాలుర ఉన్నత పాఠశాలకు సమీపంలో ఉన్న పాన్ షాపులను ఆయన తనిఖీ చేశారు.

రేగిడి: మండలంలోని ఉంగరాడ మెట్ట వద్ద పలు దుకాణాలలో మాదకద్రవ్యాల అమ్మకాలపై మంగళవారం ఎస్ఐ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్రతి దుకాణంలోనూ, స్టాక్ రూములను క్షుణ్ణంగా తనిఖీలు చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నీలావతి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలైన గంజాయి, నాటు సారా ఇతర మత్తు పదార్థాలను అమ్మినా, సేవించినా కేసులు తప్పవని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా చూడాలన్నారు. మత్తుకు బానిసైన యువత జీవితాలు నాశనం అవుతాయన్నారు. మాదకద్రవ్యాలకు యువత బానిస కాకుండా తమ లక్ష్యాలకు చేరుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సమస్యలుంటే పరిష్కరిస్తాం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో సమస్యలుంటే పరిష్కరిస్తామని నియోజకవర్గం ఇఆర్ఒ ఎం.నూకరాజు తెలిపారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అఖిల పక్షం నాయకులతో ఎఆర్ఒ కె.శ్రీకాంత్, ఎన్నికల డిటి వివిఆర్ జగన్నాధరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఆర్ఒ నూకరాజు మాట్లాడుతూ నియోజకవర్గం మొత్తంలో 248, మండలంలో 70 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వాటిలో ఏవైనా సమస్యలుంటే పరిష్కరిస్తామని అన్నారు. అఖిల పక్షం నేతలు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో వేరు వేరుగా ఓట్లు నమోదయ్యాయని వాటిని సరి చేయాలని కోరారు. ఓట్లు ఒక దగ్గర పోలింగ్ కేంద్రం ఒక దగ్గర ఉండడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిపై ఇఆర్ఒ నూకరాజు మాట్లాడుతూ చేర్పులు, మార్పులు నిరంతరం ప్రక్రియ కాబట్టి వాటిని సరి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు లెంక అప్పలనాయుడు, సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు, టి. అప్పల నరసయ్య, జనసేన నాయకులు అదపాక చిన్న, కాంగ్రెస్ నాయకులు కె. పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొత్తవలస


నెల్లిమర్ల: మొక్కలు నాటుతున్న టిడిపి నాయకులు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండలంలోని ఉత్తరాపల్లిలో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృక్ష సంపదతో ఆహ్లాదకర వాతావరణం ఉంటుందని హాయినిచ్చే నీడతో పాటు అందమైన పూలు, పలసాయంతో మానవజాతి మనుగడకు ఎంతో మేలు చేస్తాయన్నారు. అనంతరం సింగంపల్లి చిన దేముడమ్మ పొలంలో సపోటా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రమణయ్య, టిడిపి మండల అధ్యక్షులు గొరపల్లి రాము, మాజీ జెడ్‌పిటిసి కోళ్ల శ్రీను, క్లస్టర్ ఇంచార్జ్ రత్నాజీ, ఎపిఒ యాళ్ల జనార్దన్‌రావు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం : మండలంలోని తెర్లాం గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు పొలాల్లో పండ్ల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎపిఒ కె.సుశీల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఎన్.ఉమాలక్ష్మి, ఎంపిడిఒ ఆర్.రాంబాబు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎపి మార్క్ ఫెడ్ చైర్మన్, టిడిపి నియోజకవర్గం ఇంచార్జి కర్రోతు బంగార్రాజు కోరారు. మంగళవారం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా తంగుడుబిల్లి, ఎటి అగ్రహారం గ్రామాలలో ఆయన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో విశాఖ నార్త్ పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల రాజారావు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గురాణ చక్రి, ఎంపిటిసి చందక చిన్నంనాయుడు, టిడిపి నాయకులు పోతల రాజప్పన్న, నల్లం శ్రీను, తాడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని పేడాడ గ్రామంలో మంగళవారం నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగమాధవి ప్రజలతో కలిసి మొక్కలు నాటి, ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పల్లె భాస్కరరావు, సంఘం సురేష్, బొందడ రవికుమార్, ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, పైలా శంకర్, పాలు శ్రీను, కంది కిరణ్, కోన శివకుమార్, రాము, తొత్తడి ప్రకాష్, సిరికి అప్పారావు, వెంకట్రావు, కాసుల రాజు, మెండి ప్రకాష్, రఘు, కిరణ్, చిరంజీవి పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని కేజీపూడి రైతుల పొలాల్లో ఎపిఒ ఆదిలక్ష్మి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చల్ల వెంకట్రావు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు, రైతులు పాల్గొన్నారు.

మెంటాడ: మెంటాడ ఉద్యానవన రైతు రామునాయుడు మెట్టి భూములో టెక్నికల్ అసిస్టెంట్ వెంకటరావు మంగళవారం జీడి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో మెంటాడ ఫీల్డ్ అసిస్టెంట్ సువ్వాడ గౌర్నాయుడు, భూయజమాని కునుకు రామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'సుపరిపాలన'

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని ఒమ్మి, తంగుడుబిల్లిలో టిడిపి నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన పథకాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎపి మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల టిడిపి ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ ఎన్నికల హామీలను ఒక్కొక్కటికీ అమలు చేస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ నార్త్ పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల రాజారావు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గురాణ చక్రి, ఎంపిటిసి చందక చిన్నంనాయుడ, టిడిపి నాయకులు పోతల రాజప్పన్న, కురిమినేని రమణ, బొంతు రమణ, తాడ్డి సత్యనారాయణ, రెడ్డి సత్యం, దాన్నన రామ్మూర్తి, రెడ్డి నారాయణ రావు, నల్లం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

లక్కవరపుకోట: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా పని చేస్తుందని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. మంగళవారం కొట్యాడ గ్రామంలో సుపరిపాలనకు తొలి అడుగు ఇంటింటి ప్రచారంలో ఆమె పాల్గొని ప్రభుత్వ పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస ఎఎంసి చైర్మన్ సిహెచ్ మలనాయుడు, మాజీ జెడ్‌పిటిసి కె.ఈశ్వరరావు, మాజీ ఎంపిపి కొల్లి రమణ మూర్తి, మాజీ ఎంపిటిసి కె రాముడు, సర్పంచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని పెదతాడివాడలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనారాయణ, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పతివాడ సాగర్ బాబు, నాయకులు కోరాడ రమణ, దీపల్లి గౌరి ప్రసాద్, అబోతుల చిన గురునాయుడు, బాలి వెంకన్న, దిలీప్, కిరణ్, సంతోష్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

కంటోన్మెంట్: రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తోందని మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గంటా పోలి నాయుడు అన్నారు. మంగళవారం దుప్పాడ గ్రామంలో సుపరి పాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో దుప్పాడ గ్రామ పార్టీ అధ్యక్షులు నడుపూరు రాంబాబు, మాజీ సర్పంచ్ బూర లక్ష్మి, నాయుడు, మాజీ ఎంపిటిసి దుప్పాడ రామానాయుడు, మజ్జి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

మంత్రి సంపన్నుడెలా అయ్యారో చెప్పాలి?

ప్రజాశక్తి- శృంగవరపుకోట


ఎస్‌కోట: సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్తు చైర్మన్ శ్రీనివాసరావు

సిఎం చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సంపన్నులు పేదలను దత్తత తీసుకుని కార్యక్రమం పి-4 అమలులో జిల్లాలో పుట్టుకతోనే సంపన్నులైన విజయనగరం, బొబ్బిలి రాజులు, ఎన్నికల అఫిడవిట్‌లో 800 కోట్లు ఆస్తులు ఉన్నట్టు ప్రకటించిన నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి వంటి వారంతా చంద్రబాబు మాటను ఇప్పటివరకు స్ఫూర్తిగా తీసుకోలేదని ఈ కార్యక్రమం ద్వారా ఏ ఒక్క కుటుంబాన్ని దత్తత తీసుకోలేదని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. కానీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెంటనే స్పందించి తాను సంపన్నుడినని జిల్లాలో 264 కుటుంబాలను దత్తత తీసుకుంటున్నానని ప్రకటించారని గుర్తు చేశారు. ఒక సంవత్సర కాలంలో మంత్రి ఎలా సంపన్నులు అయ్యారో చెప్పాలని సెటైర్లు వేశారు. పట్టణంలోని ఎరుకమ్మ పేరంటాలు కళ్యాణ మండపంలో మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైసిపి మండల అధ్యక్షులు మోపాడ కుమార్ అధ్యక్షతన మంగళవారం నియోజక వర్గం విస్తృత స్థాయి సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధినీ కూటమి ప్రభుత్వ అభివద్ధిగా చెప్పుకుంటుందన్నారు. తాటిపూడి రిజర్వాయర్ గొర్రిపాటి పేరు జీవో తొలగించి మళ్లీ వారు కొత్తగా అదే పేరుపై జీవో ఇచ్చారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు జిల్లాలో ఏం జరుగుతుందో తెలియదని, జిందాల్ కంపెనీకి సేకరించిన భూముల్లో ఎంఎస్‌ఎంఈ పార్క్ ఏర్పాటుపై గత వైసిపి ప్రభుత్వం జీవో ఇచ్చిందని ఇప్పుడు తమకేమీ తెలియదని అక్కడ ఎంఎస్‌ఎంఈ పార్కు ప్రస్తావనే లేదని జిల్లా మంత్రి అనటం విడ్డూరమని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతి, నెక్కల నాయుడు బాబు, మూకల కస్తూరి, జెడ్‌పిటిసి వెంకటలక్ష్మి, శోభ స్వాతిరాణి, చింతాడ సర్పంచ్ అప్పాన సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత హామీలివ్వడంలో చంద్రబాబు దిట్ట

డెంకాడ: ప్రజలకు మోసపూరిత హామీలు ఇవ్వడంలో సిఎం చంద్రబాబు దిట్ట అని వైసిపి జిల్లా అధ్యక్షులు, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. చంద్రబాబు నాయుడు చేసిన మోసాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. మండలంలోని పినతాడివాడలో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అధ్యక్షతన మంగళవారం నియోజకవర్గం వైసిపి విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ బాబు సూరిటీ మోసం గ్యారంటీ అనే నినాదంతో ఇంటింటికి వెళ్లి బాబు చేసిన మోసాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు చేయలేదని సూపర్ సిక్స్ కూడా ఇవ్వలేదని విమర్శించారు. గ్రామాల్లోకి వస్తున్న టిడిపి నాయకులను ఎక్కడికక్కడ నిలదీయాలన్నారు. ఎన్నికల్లో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ బాండ్ పేపర్ల మీద సంతకాలు పెట్టి మరి హామీలు గుప్పించారని ఆ హామీలు ఇప్పుడు ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. మహిళలకు ఏడాదికి మూడు సిలిండర్లు అని చెప్పి గత సంవత్సరంలో ఒక్క సిలిండర్‌నే కేటాయించిందని పలు నిబంధనలతో కొంతమందికే ఈ పథకం పరిమితం చేసినప్పటికీ నేటికీ చాలామందికి ఖాతాల్లో సబ్సిడీ డబ్బులు వెయ్యలేదని విమర్శించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర రావు, ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్‌బాబు, నియోజకవర్గం పరిశీలకులు కిల్లి సత్యనారాయణ, వైసిపి జిల్లా అంగనవాడి అధ్యక్షులు పతివాడ కృష్ణవేణి, నాలుగు మండలాల జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, పార్టీ అధక్షులు, సర్పంచులు, ఎంపిటిసిలు నాయకులు పాల్గొన్నారు.



వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

వైఎస్ పాలన మరువలేనిది

మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధితో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పాలన మరువ లేనిదని శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో పాటు ఆయన తనయుడు మాజీ ముఖ్యమంత్రి నాయకత్వాన్ని బలపర్చాలని పిలుపునిచ్చారు. పదవులు ఉన్నా లేకున్నా వైసిపి ప్రజల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు. రాజశేఖరరెడ్డి 76వ జయంతి వేడుకలను వైసిపి విజయనగరం నియోజకవర్గం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సిఎంఆర్ జంక్షన్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి కోలగట్ల వీరభద్రస్వామి, నగర మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 30 కేజీల భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం 300 మంది పేదలకు గొడుగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి భౌతికంగా లేకపోయినా రాష్ట్ర ప్రజలందరి హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్నారని అన్నారు. రైతుల కోసం ఆయన చేసిన ఉచిత విద్యుత్ పథకంతో వ్యవసాయ రంగానికి వెన్నుదన్నుగా నిలిచారని కొనియాడారు. పేద కుటుంబాల్లో ఉన్న ఉన్నత చదువులు అభ్యసించేందుకు ఫీజురీయింబర్స్ మెంట్ పథకాన్ని అమలు చేశారని చెప్పారు. ఆరోగ్య శ్రీ పథకానికి శ్రీకారం చుట్టి ఉచితంగా వైద్య సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో వై సిపి నగర అధ్యక్షుడు ఆశపు వేణు, విజయనగరం కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు శెట్టివీరవెంకట రాజేశ్వరరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కెల్ల త్రినాథ్, జిల్లా యువజన విభాగం నాయకులు జి.ఈశ్వర్ కౌశిక్, పలువురు కార్పొరేటర్‌లు, సర్పంచ్‌లు, మహిళా విభాగం నాయకులు, యువజన విద్యార్థి విభాగం నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరి ప్రదర్శనకు 40 ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

సింహాచలం సింహాద్రి అప్పన్న గిరి ప్రదర్శనకు 40 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు విజయనగరం ఎపిఎస్ ఆర్‌టిసి డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు తెలిపారు. గిరి ప్రదర్శనకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తూ విజయనగరం నుంచి సింహాచలంకు 40 ప్రత్యేక బస్సులను నడుపుతున్నామన్నారు. భక్తులకు ఎటువంటి అంతరాయం కలగకుండా బస్సులు ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నామన్నారు. ప్రత్యేక సర్వీసులతో పాటు మరికొన్ని బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

సేవలు పారదర్శకతకు కంప్యూటరైజ్డ్ విధానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజలకు అందిస్తున్న సేవలు ఇక నుండి పూర్తి పారదర్శకంగా, ఆంధ్రప్రదేశ్ కంప్యూటరైజెడ్ మెయింటెనెన్స్ అండ్ మేనేజ్మెంట్ విధానంలో నిక్షిప్తం చేయనున్నట్లు కమిషనర్ నల్లనయ్య తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నూతన విధి విధానాలను సచివాలయ కార్యదర్శులకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వాట్సప్ గవర్నెన్స్ ద్వారా సులభతరమైన రీతిలో పౌర సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేసిందన్నారు. పురమిత్ర మనమిత్ర యాప్ల ద్వారా ఫిర్యాదులు పరిష్కరించడం, ఉత్తమ సేవలు అందించడాన్ని నిర్దేశించిందని తెలిపారు. ఇఇ ప్రసాద్, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, డిఇ శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

కమిషనర్ క్షేత్ర స్థాయి పర్యటన

క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మంగళవారం కమిషనర్ పల్లి నల్లనయ్య నగరంలోని పలు ప్రాంతాలలో పర్యటించారు. పారిశుధ్య విధానాన్ని గమనించారు. అనంతరం అన్నక్యాంటీన్ కు చేరుకుని పరిశీలించారు. పారిశుధ్య విధానంలో కార్మికులు నిర్ణీత సమయానికి విధులకు హాజరవుతున్నారా లేదా అన్నది పరిశీలించారు. రెండు బుట్టల విధానం సంపూర్ణంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సిబ్బందికి సూచించారు.



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు, కార్మిక సంఘాల నాయకులు

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

కార్మికుల హక్కులకు భంగం కలిగించే లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెకు మద్దతుగా మంగళవారం గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మికులు, ఉద్యోగుల హక్కులపై దాడి చేస్తుందని విమర్శించారు. లేబర్ కోడ్ చట్టాలు తేవడం అన్యాయమన్నారు. లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, స్వామినాయుడు, సుధాకర్, కృష్ణదాసు, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జెజెఎం పనులు పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని పాటూరు, ఓబలయ్యపాలెంలో జెజెఎం నిధులతో జరుగుతున్న పనులను మంగళవారం జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. డిఇ రమణప్రభాత్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ కె.పైడిరాజు, క్యూసిఎఈ రాజేష్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ వి.దేవి పాల్గొని పనుల వివరాలు నాణ్యతను పరిశీలించారు.



పనులను పరిశీలిస్తున్న అధికారులు

హిట్ అండ్ రన్' కేసుల్లో వాహనాలను గుర్తించాలి

ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి - కంటోన్మెంట్

హిట్ అండ్ రన్ కేసుల్లో నేరానికి పాల్పడిన వాహనాన్ని సాధ్యమైనంత వేగంగా గుర్తించాలని అధికారులను ఎస్‌పి వకుల్ జిందాల్ ఆదేశించారు. ఈ కేసులపై మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 'హిట్ అండ్ రన్', గుర్తు తెలియని మృతదేహాల కేసులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నేర స్థలం నుంచి వాహనం వెళ్లే మార్గంలోగల అన్ని సిసి కెమెరాలను, ఫుటేజీలను, టోల్ గేట్ల రికార్డులను పరిశీలించాలన్నారు. హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు పరిహారం అందించేందుకు ప్రతిపాదనలను సంబంధిత డాక్యుమెంట్లను జతపర్చి సంబంధిత ఆర్‌డిఓకు పంపాలన్నారు. ఈకేసుల్లో సమాచారం అందిన వెంటనే రోడ్ సేఫ్టీ వాహనాలు, చెక్ పోస్టులను, సరిహద్దు పోలీసు స్టేషన్లను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం, వివిధ పోలీసు స్టేషన్లలో దర్యాప్తులో ఉన్న 194 బి.ఎన్.ఎస్.ఎస్. (గుర్తు తెలియని మృతదేహం) కేసులను ఎస్‌పి సమీక్షించారు. చనిపోయిన వ్యక్తులను గుర్తించేందుకు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. వ్యక్తులను గుర్తించేందుకు వారి ఫోటోలను, వివరాలను నాట్ గ్రిడ్ వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేయాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, సిఐలు ఎ.వి. లీలారావు, ఆర్.వి.ఆర్.కె చౌదరి, ఎస్.శ్రీనివాస్, ఎల్.అప్పల నాయుడు, బి. సుధాకర్, వివిధ పోలీసు స్టేషన్లకు చెందిన పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు.



హోం గార్డు కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎస్‌పి

హోంగార్డు కుటుంబానికి 'చేయూత' అందజేత

జిల్లా పోలీసుశాఖలో హోంగార్డుగా విజయనగరం ట్రాఫిక్ పోలీసు స్టేషనులో పని చేసి, ఇటీవల కార్డియాక్ సమస్యతో మరణించిన హోంగార్డు పి.శ్రీనివాసరావు కుటుంబానికి చేయూత అందించేందుకు సిబ్బంది పోగు చేసిన ఒక్క రోజు డ్యూటీ అలవెన్సు చెక్కును ఎస్‌పి వకుల్ జిందాల్, మంగళవారం అందజేశారు. హోంగార్డులు సమకూర్చిన ఒక్క రోజు డ్యూటీ అలవెన్సు రూ.3,23,050 చెక్కును శ్రీనివాసరావు సతీమణి పి.లక్ష్మి ప్రసన్నకు ఎస్‌పి అందజేశారు. భర్త మరణానంతరం అతని కుమారుడిని హోంగార్డుగా నియమించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, హోంగార్డ్సు ఇన్చార్జ్ ఆర్.ఆర్.రమేష్ కుమార్, డిపిఒ సూపరింటెండెంట్ టి.రామకృష్ణ, పోలీసు కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



హిట్ అండ్ రన్ కేసులపై విచారణ చేస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి - కొత్తవలస

వరి నారు మడిలో నీటి యాజమాన్య పద్ధతులు తప్పకుండా పాటించినప్పుడే సకాలంలో వరినారు ఉడుపులకు సిద్ధమవుతుందని కొత్తవలస ఎడిఎ బి.భానులత అన్నారు. మంగళవారం మండలంలో కంటకాపల్లి, కాటకాపల్లి రైతు సేవా కేంద్రాల వద్ద పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నారు మడిలో నీటి యాజమాన్యం సక్రమంగా నిర్వహించటంతో పాటు 19-19-19 గానీ, యూరియా గానీ నీటిలో కలిపి పిచికారి చెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



కొత్తవలస: రైతులకు సూచనలు చేస్తున్న ఎడి బి. భానులత

బొండపల్లి: మండలంలోని ముద్దూరు, నెలివాడ రైతు సేవా కేంద్రాల్లో మండల వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం పోలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గజపతినగరం సహాయ వ్యవసాయ సంచాలకులు నిర్మల జ్యోతి మాట్లాడుతూ గ్రామంలో రైతులకు వెదజల్లే వరి పెంపకంలో చేపట్టవలసిన వివిధ యాజమాన్యం పద్ధతులు, కౌలు రైతులుకు పంట సాగు హక్కు పత్రం వల్ల కలుగు ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ముద్దూరు పశు వైద్య సహాయకులు సత్యనారాయణ పశువుల్లో వచ్చే వివిధ రకాల వ్యాధుల నివారణ చర్యలు గురించి పశుసంవర్ధక శాఖ ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి వివరించారు. అనంతరం సహాయ వ్యవసాయ సంచాలకులు నిర్మల జ్యోతి వరిలో కొత్త రకాలకు సంబంధించి చిరు సంచులను రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మల్లికార్జునరావు, వ్యవసాయ సహాయకులు సాయి, అనిల్ పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

రామభద్రపురం: వరి నారుమల్లలో సంరక్షణా పద్ధతులు పాటిస్తే సకాలంలో ఎదుగుదలకు వస్తుందని స్థానిక వ్యవసాయాధికారి అమరా శివ తెలిపారు. పొలం పిలుస్తోందిలో భాగంగా మంగళవారం కోట శిర్లాం, బూసాయవలస గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించి పంటల యాజమాన్య పద్ధతులు వివరించారు. వరి నారుమల్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పత్తి పంటలో రసం పీల్చే పురుగుల నివారణా పద్ధతులు వివరించారు. వరి, మొక్కజొన్న, పత్తి పంటలకు మీసేవ కేంద్రాల్లో పంటల బీమా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎఒలు వెంకట రమణ, రేవతి, రేణుక ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



వేపాడ: వరినారు మడిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

చీపురుపల్లి: సేంద్రియ వ్యవసాయంతోనే అధిక దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయాధికారిని ఎస్ సూర్యకుమారి తెలిపారు. మంగళవారం మండలంలోని అలజంగి, రామలింగాపురం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సేంద్రియ ఎరువులు వాడటం వల్ల అధిక దిగుబడులతో పాటు ఆరోగ్య కరమైన పంట ఉత్పత్తులను ప్రజలకు అందించవచ్చని రైతులకు అమె సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని ఆతవ, సింగరాయి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారి ఎం స్వాతి, మండల వ్యవసాయ విస్తరణ అధికారి అక్కునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు.



తెర్లాం : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ రాంబాబు



గంట్యాడ : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి హైమావతి

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలని ఎంపిపి పీరుబండి హైమావతి అన్నారు. మంగళవారం స్థానిక మండల కార్యాలయంలో జరిగిన గ్రామ పంచాయతీ పురోగతి యాక్షన్ ప్లాన్ శిక్షణ తరగతుల్లో ఆమె పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ ఆర్‌వి రమణమూర్తి, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు పీరుబండి జైహింద్ కుమార్, వివిధ శాఖల అధికారులు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తెర్లాం: మండల కేంద్రంలోని వెలుగు సమైక్య సమావేశ మందిరంలో ఎంపిడిఒ రాంబాబు ఆధ్వర్యంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, విద్యాశాఖ అధికారులకు పంచాయతీల పురోగతిపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు

డెంకాడ: స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ భవనంలో మంగళవారం పంచాయతీ పురోగతి సూచిక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వమించారు. ఈ శిక్షణకు మాస్టర్ ట్రైనర్‌గా పెదతాడివాడ పంచాయతీ కార్యదర్శి సిహెచ్.అప్పలనాయుడు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలోఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, ఎంపిడిఒ వై.భవాని, డిప్యూటీ ఎంపిడిఒ డి.శ్రీనివాసరావు, వివిధ మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సహాయకులు, డిజిటల్ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ: పేదరికాన్ని నిర్మూలించి ఆకలి బాధలను నివారించే విధంగా కృషి చేయాలని టిఒటి ముత్యాలునాయుడు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో సచివాలయం సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ శాఖ ఎఇ గౌతమ్, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం పంచాయతీ పురోగతి సూచిక అనే అంశంపై పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు, ఏఎన్‌ఎంలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి

గ్రామాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండాలని ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ సూచించారు. మంగళవారం సంగరాయి సచివాలయాన్ని ఆయన సందర్శించారు. ఇంటింటికి తిరిగి సర్వే చేయాలని, తడి చెత్త పొడి చెత్త వేరు వేరుగా సేకరించాలని చెప్పారు నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై చెత్త వేసిన వారికి రూ.25 వేలు జరిమానా వేస్తామని హెచ్చరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత మన అందరి పైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ జైల్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ మంగళవారం విజయనగరం సబ్ జైలును ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. కారాగారంలో ఉన్న ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. వీరికి పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఖైదీల పట్ల సిబ్బంది గాని, తోటి ఖైదీలు గాని ఎటువంటి వివక్షత చూపించరాదని తెలిపారు. ఆ విషయమై జైలు సూపరింటెండెంట్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సబ్ జైల్లో కొనసాగుతున్న జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను తనిఖీ చేశారు. అనంతరం ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేర ప్రవృత్తిని విడనాడి మంచి పౌరులుగా మెలగాలని హితవు పలికారు. జైల్లో ఉన్న ముద్దాయిలకు ఉచిత న్యాయ సహాయము అందించడమే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ముఖ్య కర్తవ్యమని అన్నారు.

గిరిజన బాలికల వసతి గృహం తనిఖీ

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. భబిత ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్ రింగ్ రోడ్డు లో ట్రైబల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించారు. హాస్టల్ గదులను పరిశీలించారు.



వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణ ప్రసాద్

మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. పిల్లలకు అందుతున్న మెనూ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో వారికి మెనూ ప్రకారము భోజనం అందిస్తున్నారా లేదా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పేరెంట్స్ డేను జయప్రదం చేద్దాం

ప్రజాశక్తి - వంగర

ఈ నెల 10న జరగబోవు మెగా పేరెంట్స్ డే కార్యక్రమాన్ని కలిసికట్టుగా జయప్రదం చేయాలని ఎంపిడిఒ ఎస్.రఘునాథ చారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంగన్వాడీలు, ఉపాధి హామీ, వెలుగు కార్యాలయం, ఎంఆర్‌సి ఉద్యోగులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ హరి రమణారావు, ఎంఇఒ జగదీశ్వరి పాల్గొన్నారు.

చీపురుపల్లిలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-చీపురుపల్లి

వర్షాకాలం కారణంగా సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులను యుద్ధ ప్రాతిపదికన శానటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, సూపరవైజర్ రామ్మోహన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఇఒ ఝాన్సీలక్ష్మి తెలిపారు. మంగళవారం చీపురుపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న 21 వార్డులలో వార్డుల వారీగీ పారిశుధ్య పనులు చేస్తున్నట్లు వారు తెలిపారు.

అభివృద్ధిని చూడలేకనే విమర్శలు

ప్రజాశక్తి - గంట్యాడ

కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూడలేక మంత్రి శ్రీనివాసరావుపై అవాక్కులు చవాక్కులు చేస్తు విమర్శిస్తున్నారని టిడిపి మండల అధ్యక్షులు కొండపల్లి భాస్కర్‌నాయుడు, వెలమ సంఘం రాష్ట్ర నాయకులు అల్లు విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడారు. గజపతినగరంలోని వైసిపి పార్టీ సమావేశంలో ఆ పార్టీ నాయకులు చంద్రబాబునాయుడు, మంత్రి శ్రీనివాసరావులను విమర్శించడం సరైంది కాదన్నారు. మంత్రి శ్రీనివాసు పార్టీ కోసం ప్రజల కోసం కష్టపడుతున్నారన్నారు. వైసిపి పార్టీని గ్రామాలలో ప్రజలు పట్టించుకోక పోవడంతో అసూయపడి విమర్శలకు దిగుతున్నారన్నారు. అణగారిన కుటుంబాలను దత్తత తీసుకొని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తుంటే చూడలేక వైసిపి శ్రేణులు తమ తప్పును తెలుసుకోకుండా విమర్శలకు దిగుతున్నారన్నారు. ఈ సమావేశంలో తాటిపూడి ఆయకట్టు సంఘం నాయకులు కళ్లెంపూడి జగన్నాథం, నాయకులు బూడి గాంధీ, రంది చిన్న రామునాయుడు, సతీష్, రంది రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిపై బురద జల్లడం మానుకోవాలి

బొండపల్లి : కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో నియోజకవర్గంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు వస్తున్న ప్రజాభిమానం ఓర్వలేకనే జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య లేనిపోని ఆరోపణలు చేసి బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని గజపతినగరం ఎఎంసి వైస్ చైర్మన్ కోరాడ కృష్ణ అన్నారు. స్తానిక మండల సముదాయం వద్ద టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. మంత్రిని విమర్శించే అర్హత వారకి లేదన్నారు.

గంజాయి చాక్లెట్లు అమ్మితే కేసులు

ప్రజాశక్తి-బొబ్బిలి

గుట్కాలు, గంజాయి చాక్లెట్లు అమ్మితే కేసులు నమోదు చేస్తామని పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ అన్నారు. పట్టణంలోని మంగళవారం ఆపరేషన్ షేఫ్ క్యాంపస్ జోన్ నిర్వహించారు. పాఠశాల, కళాశాల సమీపంలో ఉన్న పాన్ షాపులను తనిఖీ చేశారు. నిషేధిత గుట్కాలు అమ్మడం చట్టరీత్యా నేరమన్నారు. గంజాయితో తయారు చేసిన చాక్లెట్లు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాన్ షాపులపై ప్రత్యేక నిఘా పెడతామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-సంతకవిటి

హక్కుల రక్షణ, చట్టాల పరిరక్షణకు చేపట్టబోయే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేస్ పిలుపునిచ్చారు. ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సంతకవిటి, మండవకురిటి పిహెచ్‌సిలో వైద్యాధికారులకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆశావర్కర్లనుద్దేశించి సురేష్ మాట్లాడారు. ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు, ఎనిమిది గంటల పని దినం, పెన్షన్ తో కూడిన రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఉద్యోగ భద్రత, లేబర్ కోడ్స్ రద్దు, ప్రభుత్వ రంగ సంస్థల రక్షణకై జులై 9న జరుగుతున్న దేశ వ్యాప్త సమ్మెలో ఆశా వర్కర్లందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలోసిఐటియు మండల కన్వీనర్ కె.అసిరప్పడు, ఆశావర్కర్లు గౌరమ్మ, సుగుణ, పద్మ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టైర్ బంద్‌కు ఆటో యూనియన్ పిలుపు

బుధవారం టైర్ బంద్ పాటిద్దామని సిఐటియు ు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ పిలుపునిచ్చారు. సంతకవిటి మండల కేంద్రంలో పోస్టర్ ఆవిష్కరించారు. డ్రైవర్ల మెడకు ఉరితాడు బిగించి, రవాణా రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టపెట్టే మోటార్ వాహన చట్టం 2021, భారత న్యాయ సంహిత చట్టం బి.ఎన్.ఎస్. 106 ను రద్దు చేయాలన్నారు. 10 కోట్ల మంది రవాణా రంగ కార్మికులకు కేరళ తరహాలో సంక్షేమ బోర్డు ఏర్పాటుతో పాటు ప్రభుత్వమే ఒక యాప్‌ను నడపాలన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని, వాహన కొనుగోలుకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలన్నారు. వాహన మిత్ర 15వేలు తక్షణమే చెల్లించాలన్నారు. రవాణా రంగ కార్మికులంతా జులై 9న రాజాంలో జరిగే ప్రదర్శనలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు ఎం. కోటేశ్వరరావు, ఎస్.సూర్యనారాయణ,కె. చంద్రశేఖర్, కె.వేణు,పి గున్నేష్, శివ, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు